# స్పెయిన్, పోర్చుగల ట్రావెలాగ్



## – మల్లాది వెంకట కృష్ణమూర్తి

*(గత సంచిక తరువాయి)*

**12 సెప్టెంబర్ 2015**

ఉదయం ఆరున్నరకి మెలుకువ వచ్చింది. 7.45కి లిఫ్ట్ బిజీగా ఉండటంతో మెట్ల మీదే కిందికి దిగి బ్రేక్‌ఫస్ట్ హాల్‌కి చేరుకున్నాం. వెజిటేరియన్స్‌కి ఐటమ్స్ పెద్దగా లేవు. కేరట్, ఆరెంజ్, పంపర పనస, అనాస జ్యూస్‌లు, నాలుగు రకాల ఛీజ్‌లు (యూరప్‌లో ఛీజ్ వాడకం చాలా ఎక్కువ) క్రొయ్‌జాంట్, డైట్ స్ట్రాబెర్రీ జామ్, గ్రీన్ టీ, కాఫీ, యోగర్ట్, ఇవి కాక నాలుగు రకాల మాంసాహారాలు మాత్రమే అక్కడ ఉన్నాయి.

రూమ్‌కి వెళ్ళి మా సామానుతో కిందికి వచ్చి బస్ వచ్చేదాకా లాబీలో వేచి ఉన్నాం. 9.20కి బస్ వచ్చి ఆగింది. ముందే ఎక్కిన ఓ గుజరాతీ ఆవిడ తన బేగ్‌ని ఐల్‌లో అడ్డంగా పెడితే దాటుకుంటూ వెళ్ళాల్సి వచ్చింది. టూరిస్ట్ గ్రూప్‌లో సహనం ముఖ్యం. ధనంలో సంపన్నులైనా సంస్కారంలో పేదవారు ప్రతీ బృందంలో తారసపడుతూంటారు. 9.45కల్లా మా బస్ స్పెయిన్ నించి పోర్చుగల్ రాజధాని లిస్బన్‌కి బయలుదేరింది. మా గమ్యానికి దాదాపు 4గంటల ప్రయాణం.

ఎప్పట్లానే దీపక్ గాయత్రీ మంత్రాన్ని ఉచ్చరించాడు. కిటికీలోంచి చూస్తే సాలమాంకా చిన్న ఊరైనా శుభ్రంగా ఉంది. మా గ్రూప్‌లోని దివ్యకాంత్ పారిక్ ప్రొఫెషనల్ బిల్డర్, ఔత్సాహిక సింగర్. భార్య కేన్సర్ స్పెషలిస్ట్. అతను దారిలో హిందీ ఖవాలి పాటలు పాడాడు. 'ఐ మేరి జోహ్రా జబీన్ తుఝె మాలూం నహీ (వక్త్) ఝూం బరాభరాభర్ ఝూం షరాబీ ఝూం బరాభరాభర్ ఝూం (ప్రైవేట్ సాంగ్) కే పగ్ ఘుంగ్రూ బాంద్ మీరా నాచ్‌తే (నమక్ హలాల్) మొదలైన పాటలు పాడాడు. ఉదయం పదికి ఆకాశంలో చంద్రుడు కనిపించాడు. అదే సమయంలో సాలమాంకా నించి 105 కిలోమీటర్ల దూరంలోని పోర్చుగల్ సరిహద్దుకి చేరుకున్నాం. నీలం రంగు బోర్డ్ మీద గుండ్రటి నక్షత్రాల మధ్య పోర్చుగల్ అని ఇంగ్లీష్‌లో రాసుంది. నేను చూసిన 50 దేశాల్లోని 32వ దేశమది.

"స్పెయిన్ టైం కంటే పోర్చుగల్ టైం గంట తక్కువ. కాబట్టి మీ గడియారాలని ఓ గంట వెనక్కి తిప్పుకోండి" దీపక్ చెప్పాడు.

స్పెయిన్, పోర్చుగల్ సరిహద్దులో ఎలాంటి బారికేడ్స్, చెకింగ్ సిబ్బంది లేరు. యూరోపియన్ యూనియన్‌లో ఓ దేశం నించి మరో దేశానికి స్వేచ్ఛగా ప్రయాణించొచ్చు. పోర్చుగల్లోకి ప్రవేశించాక స్థానిక సమయం పదిన్నరకి ఓ సూపర్ మార్కెట్ దగ్గర రెస్ట్ స్టాప్.

"షాపింగ్ కి వెళ్ళొద్దు. రెస్ట్ రూం అవసరం ఉన్నవారు అక్కడికి వెళ్ళిరండి. పావుగంటే ఆగుతుంది." దీపక్ చెప్పాడు.

కాని సమయాన్ని చక్కగా ఉపయోగించుకున్న కొందరి చేతుల్లో షాపింగ్ బేగ్స్ కనిపించాయి. 10.50కి బస్ బయలుదేరింది.

"నేనింక హెడ్ మాస్టర్ పాత్రని పోషించాలి. వెళ్ళేప్పుడు మీ పెట్టెలు పడతాయో, లేదో చూసుకోండి" వాళ్ళ బేగ్స్‌ని చూసిన దీపక్ నవ్వుతూ హెచ్చరించాడు.

***పోర్చుగల్***

ఇది యూరప్ ఖండంలో నైరుతి దిశలోగల ఐబీరియన్ ద్వీపకల్పంలో ఉంది. అఫీషియల్‌గా దీని పేరు పోర్చుగీస్ రిపబ్లిక్. యూరప్‌లోని అతి పురాతన రాజ్యాల్లో ఇదొకటి. ఉత్తర, తూర్పు దిశల్లో స్పెయిన్, పశ్చిమ, దక్షిణ భాగంలో అట్లాంటిక్ మహాసముద్రం ఉంది. దాన్ని దాటి 14-15 శతాబ్దాల్లో ప్రపంచంలోని అనేక దేశాలకి వెళ్ళి తమ కాలనీలని విస్తరించారు. దీని విస్తీర్ణం 92,212 చదరపు కిలోమీటర్లు. జనాభా సంఖ్య కోటి 56 లక్షలు. యూరప్‌లో ఒకే దేశం సరిహద్దుగా గల దేశం పోర్చుగల్. పోర్చుగీస్ అధికార భాష. దీని రాజధాని లిస్బన్ అతి పెద్ద నగరం. 84.3 శాతం క్రిస్టియన్స్, 6.6శాతం జనాభాకి మతం లేదు. 0.6శాతం ఇతర మతస్థులు, తమ మతాన్ని వెల్లడించనివారు 8.3 శాతం మంది ఉన్నారు. తలసరి ఆదాయం 36,079 డాలర్లు. నామినల్ జిడిపి 2574 బిలియన్. కరెన్సీ యూరో. సగటు ర్దాయం మగాళ్ళకి 78, మహిళలకి 83 సంవత్సరాల 4 నెలలు. 12వ క్లాస్ దాకా లేదా 18వ ఏట దాకా నిర్భంధ ఉచిత విద్య. ప్రైవేట్ స్కూల్స్ కూడా ఉన్నాయి.

ఇండియాకి సముద్ర మార్గం కనిపెట్టిన ఆరు సంవత్సరాలకి పోర్చుగీస్ భారత ఉపఖండంలో పోర్చుగీస్ ఇండియా అనే కాలనీని స్థాపించి హిందూ మహాసముద్రం తీరం వెంట కోటలని నిర్మించారు. 1505 నించి 1510 దాకా కొచ్చిన్, ఆ తర్వాత 1843దాకా ఓల్డ్ గోవా దాని రాజధాని. 1843 - డిసెంబర్ 1961 దాకా నోవా గోవా రాజధాని. అక్కడి అధికార భాష పోర్చుగీస్సైనా, కొంకణి, తమిళ్, కన్నడ, గుజరాతీ, బెంగాలీ, మళయాళ, మరాఠీ భాషలు కూడా మాట్లాడేవారు. డయ్యూ, దమన్‌లు కూడా వారి కాలనీలు కాబట్టి వీటన్నిటినీ కలిపి పోర్చుగీస్ ఇండియా అనేవారు. చైనాలో 1999దాకా పోర్చుగీస్ మకావ్ కూడా కాలనీగా ఉండేది. బ్రెజిల్ పోర్చుగీస్ కాలనీ కాబట్టి ఇప్పటికీ వారు పోర్చుగీస్ భాషనే మాట్లాడతారు. ఇలా ప్రపంచంలో చాలా దేశాల్లో వీరి కాలనీలున్నాయి.

చుట్టూ కొండలు. లోయలతో ఆ దారి చాలా ఆహ్లాదంగా ఉంది. మా బస్ ఓ నది మీద చాలా పొడుగాటి బ్రిడ్జ్‌ని దాటింది. పై కప్పు మీద పడ్డ మంచు జారిపోవడానికి వీలుగా ఏటవాలుగా ఉన్న ఎరుపు, నలుపు పై కప్పులు గల వందలోపు ఇళ్ళు గల చాలా చిన్న గ్రామాలు కనిపించాయి. గ్రామాల్లో చాలా ఆవులు, గుర్రాలు కనిపించాయి. ఆకాశం మొత్తం మేఘావృతమై వర్షం పడేలా ఉంది. చుట్టూ పొలాలు, పచ్చటి చెట్లు, కరెంట్ తీగలు. పొలాల్లోని స్ప్రింక్లర్స్ నీళ్ళని చిమ్ముతున్నాయి.

ఉదయం 11.45కి బస్ ఆగింది.

"రెండు గంటలకోసారి బస్‌ని ఆపి డ్రైవర్ విశ్రాంతి తీసుకోవాలన్న నియమం యూరప్ అంతటా ఉందని మీకు చెప్పాను. ఇక్కడ అరగంట స్టాప్. మళ్ళీ 12.15కి బస్ బయలుదేరుతుంది" దీపక్ చెప్పాడు.

బస్ పెట్రోల్ బంక్‌లో ఆగింది. సమీపంలోని చెక్క బెంచీల మీద కూర్చున్నాం. చాలామంది ఇండియానించి తెచ్చిన స్నాక్స్ బయటికి తీసారు. గుప్తాజీ నార్త్ ఇండియన్ బికనీర్ నమ్కీన్‌ని మాకు, జయదేవ్‌కి ఇచ్చాడు. నేను డ్రైవర్‌కి ఇండియన్



కాయిన్స్ పాకెట్, పుల్లారెడ్డిలో కొన్న చెక్కలు ఇస్తే తిని బావున్నాయన్నాడు. అక్కడున్న షాప్‌లో కోక్ జీరోని కొన్నాను. 2.15 యూరోలు. 12.20కి మళ్ళీ బస్ బయలుదేరి ఒకటిన్నరకి మా గమ్యం ఫాతిమాకి చేరుకుంటూండగా స్థానిక గైడ్ ఫోన్ చేసి 'మొదట టూరా? తర్వాత లంచా? లేక లంచ్ తర్వాత టూరా?' అని అడిగింది. దీపక్ ఆమెని లైన్లో ఉండమని మమ్మల్ని అడిగితే మొదట టూర్ అన్న బేచ్‌లో మేమూ చేతులు ఎత్తాము. ఆమె తనని ఎక్కడ కలవాలో చెప్పింది.

మా బస్ ఫాతిమాకి చేరుకున్నాక ఎక్కిన గైడ్ ముందు ఫాతిమా గురించి వివరించింది.

"గుడ్ ఆఫ్టర్‌నూన్ గైస్. మీరంతా ప్రయాణంలో అలసిపోలేదు అనుకుంటాను. నా పేరు కైలా. ముందుగా ఫతిమా గురించి మీలో ఎందరికి తెలుసు? చేతులెత్తండి" అడిగింది.

ఎవరూ ఎత్తలేదు.

"ఐతే వినండి..." చెప్పసాగింది.

<u>ఫాతిమా</u>

"72 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఫాతిమా ఔరెమ్ మున్సిపాలిటీలో ఉంది. దీని జనాభా పన్నెండు వేలు. ఇది క్రిస్టియన్ పర్యాటకులని ఆకర్షించే ఊరు. ఎందుకు? అది తెలుసుకోడానికి వందేళ్ళ క్రితం ఇక్కడ జరిగిన కొన్ని దైవిక సంఘటనలని గురించి చెప్పాలి. ఫాతిమా అరబిక్. మూరిష్ యువరాణి. గొంకాలో హెర్మిగెస్ అనే రాజు ఆమెని కిడ్నాప్ చేసి సెర్రాదా ఎయిర్ హిల్స్‌లో కొత్తగా సృష్టించిన పోర్చుగల్ రాజ్యానికి తీసుకెళ్ళాడు. ఫాతిమా ఆ రాజుతో ప్రేమలో పడి, మతం మార్చుకుని క్రిస్టియనైంది. ఆమెకి బాప్టైజ్ చేసి ఓరియానా అనే పేరు పెట్టారు. అరబ్బులు మాత్రం ఆమెని బలవంతంగా క్రిస్టియానిటీలోకి మార్చారని వాదిస్తారు. ఈ రెండు వాదాలకి ఎలాంటి ఋజువులు లేవు. కానీ ఆమెకి తల్లితండ్రులు పెట్టిన పేరు ఫాతిమానే ఈ ప్రదేశానికి పెట్టారు. ఇక్కడ ఔరెమ్‌లో 1568లో ఓ పేరిష్‌ని నిర్మించారు. శతాబ్దాల పాటు ఈ గ్రామస్థులు గొర్రెల పెంపకం, వ్యవసాయంతో బతికేవారు.

20వ సతాబ్దంలో ఓ అద్భుతం జరిగింది. ముగ్గురు స్థానిక పిల్లలు గొర్రెలని కాస్తూండేవారు. వారి పేర్లు లూసియా డాస్ శాంతోస్(10) ఆమె కజిన్స్ ఫ్రాన్సిస్కో (9) జెసింటా మార్టో (7) 13 మే 1917లో వారికి 'కోవా ద ఇరియాలో' వర్షం పడేప్పుడు, ఓ చెట్టుకింద మధ్యాహ్నం పన్నెండుకి రెండుసార్లు పెద్ద వెలుగు వచ్చి తెల్ల దుస్తుల్లోని అవర్ లేడీ ఆఫ్ ఫాతిమా దేవత దర్శనమైంది. ఆమె చుట్టూ వెలుగు కనిపించింది. ఆమె వారితో చెప్పింది.

"మీరు నాతో కలిసి ప్రార్థన చేయండి. నేను కనిపించానని ఎవరికీ చెప్పద్దు. వాళ్ళెవరూ నమ్మరు."


వాళ్ళు ఇళ్ళకి వెళ్ళాక చె ప్పలేదు. 13 జూన్న ఆమె మళ్ళీ ఆ పిల్లలకి ప్రత్యక్షమై, మూడు రహస్యాలు చెప్పింది. యుద్ధం (అప్పుడు మొదటి ప్రపంచ యుద్ధం జరుగుతోంది) త్వరలో ముగుస్తుందని, మళ్ళీ ఇంకో యుద్ధం (రెండో ప్రపంచ యుద్ధం 1939 - 1945) కూడా వస్తుందని, కానీ పోర్చుగల్ దేశప్రజలు అందులో ఇబ్బంది పడరని చెప్పింది. నిజంగానే యూరప్‌లో చాలా దేశాలు రెండో ప్రపంచ యుద్ధానికి బలైనా పోర్చుగల్‌కి ఏం కాలేదు.


2005 దాకా జీవించిన లూసియా

"ఆధ్యాత్మికంగా రెండు వాదనలు ఉన్నాయి. ఒకటి మనిషికి ఫ్రీ విల్, అంటే ఏదైనా స్వేచ్ఛగా చేసే శక్తి ఉందని. రెండోది ఫ్రీ విల్ లేదని. అంటే మనిషి చేసేదంతా దైవాజ్ఞకి లోబడి చేసేదే రాబోయే యుద్ధం గురించి ఆ దేవత చెప్పిందంటే, రెండో ప్రపంచ యుద్ధాన్ని ఆరంభించిన హిట్లర్ ఏం చేస్తాడో ముందే నిర్ణయించబడిందని భావించవచ్చు. అంటే మనిషికి ఫ్రీ విల్ ఉన్నట్లుగా కనపడ్డా, అది లేదని అర్థమౌతోంది.

ఫాతిమా వారికి మొత్తం ఆరుసార్లు దర్శనం ఇచ్చింది. పిల్లలు ఆమె గురించి ఇంట్లో చెప్పారు.

13 జులైన గ్రామప్రజలు ఆ చెట్టుదగ్గరకి వెళ్ళారు. చర్చ్, ప్రభుత్వం పిల్లల్ని ప్రశ్నించి జైల్లో పెట్టింది. అదంతా అబద్ధమని చెప్పమని, లేదా చంపేస్తామని బెదిరోస్తే పిల్లలు అందుకు అంగీకరించలేదు. 'మమ్మల్ని చంపితే అవర్ లేడీ దగ్గరకి వెళ్తాం' అని ఆ పిల్లలు భయపడకుండా చెప్పారు. 13 ఆగస్ట్‌న మళ్ళీ ఆమె దర్శనం ఇవ్వలేదు. 19 ఆగస్ట్‌న అవర్ లేడీ వారి ఇంటి సమీపంలో దర్శనం ఇచ్చింది. 13 సెప్టెంబర్‌న కూడా దర్శనం ఇచ్చింది. 13 అక్టోబర్‌న వర్షం పడుతూంటే, 70,000 మంది ఆమె ఆఖరిసారి దర్శనం ఇవ్వగానే మోకాళ్ళమీద కూర్చుని ప్రార్థించారు. స్థానికులు ఆ ప్రదేశంలో గుర్తుగా ఓ క్రాస్‌ని ఉంచారు. 1918లో కొండరాళ్ళతో పదకొండు అడుగుల పొడవు, 9 అడుగుల ఎత్తు గల చిన్న ఛాపెల్‌ని కట్టారు. అది మేరియన్ (జీసస్ తల్లి) భక్తులకి కేంద్రంగా మారింది. ఆ ప్రదేశానికి ఫెయిత్ ఆఫ్ ఫాతిమా, సిటీ ఆఫ్ పీస్, లేండ్ ఆఫ్ మిరకిల్స్ అండ్ అపరిషన్స్‌గా పేరు వచ్చింది. ఆ ఛాపెల్ చుట్టూ పెద్ద కాంప్లెక్స్‌ని నిర్మించారు. అందులో ఓ హోటల్, ఓ బసిలికాని నిర్మించారు. క్రమంగా ఇక్కడి తీర్థయాత్రగా మనుషులు రాసాగారు.


ఫాతిమా చర్చ్‌లో జీసస్

ఫ్రాన్సిస్కో 1919లో. జెసింటా 1920లో స్పేనిష్ ఫ్లూ పేండమిక్‌లో పోయారు. లూసియా నన్‌గా మారి 2005దాకా జీవించింది. 13మే 2000లో బాల్యంలో మరణించిన ఇద్దరినీ బీటిఫై (స్వర్గం యొక్క ఆశీస్సులు పొందడం) చేసారు. మొదటిసారి అవర్ లేడీ ఫాతిమా దర్శనమైన సరిగ్గా వందేళ్ళకి 13 మే 2017లో వారిని పోప్ ఫ్రాన్సిస్ కేననైజ్ (రోమన్ కేథలిక్ చర్చ్ అధికారికంగా మరణించినవారికి సెయింట్ హుడ్ ఇవ్వడం) చేసారు. మీరు మిస్సయ్యారు. ఇక్కడ ప్రతీరోజు మధ్యాహ్నం ఒంటిగంటకి కేండిల్ లైట్ ప్రొసెషన్ ఉంటుంది."

అక్కడంతా చాలామంది బక్తులతో కోలాహలంగా ఉంది. తమకి నయమౌతుందన్న ఆశతో కొందరు మోకాళ్ళ మీద చర్చ్ వైపు పాకుతూ వెళ్తున్నారు. దయ్యాలు పట్టినట్లు ప్రవర్తించేవారు, వికలాంగులు, పిచ్చివాళ్ళు కనిపించారు. వారిలో చాలామంది అనాథలని కైలా చెప్పింది. వికలాంగులని, మతి చలించిన వారిని కుటుంబ సభ్యులు ఇక్కడ వదిలేసి వెళ్తారట. వాళ్ళు యాత్రికులని అడుక్కుంటూ జీవిస్తున్నారు. ముఖ్యంగా మతిస్థిమితం లేని బిచ్చగాళ్ళని చూస్తే హృదయవిదారకంగా అనిపించింది. ఇక్కడ లేడీ ఫాతిమా నేపథ్యంలో ఓ రచయిత

రాసిన కథ గురించి చెప్పాలి. 1960లో ఆల్‌ఫ్రెడ్ హిచ్‌కాక్ ప్రెజంట్స్ అనే టివి సిరీస్‌లో దాని ఆధారంగా ప్రసారం చేసిన షోని చూసాను.

ఒకతనికి ప్రమాదం జరిగి కాళ్ళు తాత్కాలికంగా కదలవు. దాంతో అది శాశ్వత అంగవైకల్యం అని చెప్పి, అందుకు కారణమైనతని మీద దావా వేసి నష్టపరిహారంగా భారీ మొత్తాన్ని సంపాదిస్తాడు. అతను చక్రాల కుర్చీలో జీవితాంతం




కూర్చోవడానికి అతని భార్య ఇష్టపడదు. అతనికి లేడీ ఫాతిమా కాళ్ళు తెప్పించిన ఒకతను తారసపడటంతో తను కూడా తను కూడా అక్కడికి వెళ్ళి అవర్ లేడీ మహిమతో కాళ్ళు వచ్చినట్లుగా నటిస్తానని చెప్పి భార్యతో ఇక్కడికి వస్తాడు. చక్రాల కుర్చీ దిగి అందరిలా మోకాళ్ళ మీద పాకుతూ చర్చ్‌లోకి వెళ్తాడు. తనకి కాళ్ళు వచ్చాయని చుట్టుపక్కల వాళ్ళని భ్రమింపచేయడానికి లేచి నిలబడే ప్రయత్నం చేస్తాడు. కానీ లేవలేకపోతాడు. అతనికి నిజంగా కాళ్ళు పోయాయి. అదే సమయంలో అతని గ్రామంలోని కాళ్ళు కదల్చలేని ఓ బీదపిల్ల అకస్మాత్తుగా లేచి నించుంటుంది.

చాలా మెట్లెక్కి ఎత్తులో ఉన్న శాంక్చువరీ ఆఫ్ ఫాతిమాలోకి వెళ్ళాం. ఇది అనేక కేథలిక్ బిల్డింగ్స్ సముదాయం. 1930లో అక్కడ అవర్ లేడీ విగ్రహానికి వేటికన్ నించి అందిన కిరీటం కనిపించింది. 13 మే 1967న పోప్ జాన్ పాల్ - 6 ఇక్కడికి వచ్చాడు.

అక్కడ రెండు సమాధులు, బసిలికా ఒక వైపు, మరో వైపు ఛాపెల్, న్యూ చర్చ్, ఓల్డ్ చర్చ్ ఉన్నాయి. ఫాతిమా కనపడ్డ చెట్టుని కూడా గైడ్ చూపించి తెల్లటి గోడలు, పైన తెల్లటి స్తూపం మీద శిలువ ఉన్న చర్చ్‌లోకి తీసుకెళ్ళింది. అక్కడ స్టెయిర్ కేస్ టు హెవెన్‌లా మెట్లున్నాయి. విశాలమైన ఆ చర్చ్‌లో వందలమంది కూర్చునేందుకు సరిపడా బల్లలు ఉన్నాయి. గోడలకి బంగారు రంగు ఫ్రెస్కోల్లో బైబిల్ దృశ్యాలు, శిలువ వేసిన నల్లటి క్రీస్తు విగ్రహం, చిన్న స్తూపం మీద కుడిచేతిని పైకెత్తిన తెల్ల దుస్తుల్లోని అవర్ లేడీ పాలరాతి విగ్రహం ఉన్నాయి. అర యూరోతో కొవ్వొత్తి కొని చర్చ్‌లో వెలిగించాం. ఓ పంపుకి పవిత్ర జలం అనే బోర్డుంది.

"ముక్కోటి దేవతలు ఐపొయ్యారు. నా కోరిక తీరాలని ఫాతిమాని ప్రార్థించాను" బయటకి వచ్చాక పద్మజ చెప్పింది.

పక్కనే ఉన్న సావనీర్ షాప్‌లో 1.90 యూరోలకి మేరీమాత రేడియం బొమ్మని కొన్నాం. అది ఈ రోజుకీ చీకట్లో మెరుస్తూ కనిపిస్తోంది. ఎస్.ఓ.టి.సి సికింద్రాబాద్ మేనేజర్ హెప్సిబారాణి క్రిస్టియన్. ఆమె కోసం ఒక యూరోకి హోలీ వాటర్ సీసాని కొన్నాం. తిరిగి వెళ్ళాక దాన్ని ఆమెకి అందచేస్తే చాలా సంతోషించింది. అక్కడినించి లంచ్‌కి రెస్టారెంట్స్ వైపు వెళ్ళాం.

పిల్లల రైడ్ కోసం రైలు పెట్టెల ఆకారంలో గల రెండు కేబిన్స్, దానికి రైలింజన్ షేప్‌లో డ్రైవింగ్ కేబిన్, వాటన్నిటి కిందా రబ్బర్ టైర్లు ఉన్నాయి.

రెస్టారెంట్స్ బయట పేవ్‌మెంట్స్ మీద గొడుగుల కింద కుర్చీలు, టేబిల్స్ వేసున్నాయి అపొలో కెఫెలో లంచ్ తిన్నాం. వెజ్ సలాడ్ (5.90 యూరోలు) రైస్ విత్ మష్రూం, కేరెట్, కార్న్, టొమెటో (7.90) కోక్ జీరో 1. 10. మొత్తం 14 యూరోల 90 సెంట్లు అయింది. ఇరవై యూరోలు ఇచ్చి చిల్లరని ఉంచుకోమని వెయిటర్‌తో చెప్పాను.

అందులో కొన్ని తమాషా బోర్డ్‌లని ఉంచారు.

ఇఫ్ యు వాంట్ బ్రేక్‌ఫాస్ట్ ఇన్ ది బెడ్, స్లీప్ ఇన్ ది కిచెన్.

యు కాంట్ బై హేపీనెస్. బట్ యు కెన్ బై కప్ కేక్ అండ్ దటీజ్ కైండాఫ్ ది సేం హింగ్.

బార్ రూల్స్.

రూల్ - 1: బార్ టెండర్ ఈజ్ ఆల్వేస్ రైట్.

రూ -2: ఇఫ్ బార్ టెండర్ ఈజ్ రాంగ్, సీ రూల్ -1

బస్ సాయంత్రం 4.20కి లిస్బన్‌కి బయలుదేరింది.

"రేపు మేజిక్ నంబర్లు 7-8-9. నది మీద రివర్ క్రూజ్, సిటీ టూర్, షాపింగ్, రెస్టొరెంట్, బీచ్ మన ఐటెనరీలో ఉన్నాయి. మన డ్రైవర్‌కి, లోకల్ గైడ్స్‌కి టిప్స్ ఇవ్వడం ఆనవాయితీ. మనిషికి రోజుకి మూడు యూరోల చొప్పున పన్నెండు రోజుల ట్రిప్‌కి ముప్పై ఆరు యూరోలు ఇవ్వండి" దీపక్ చెప్పాడు.

ఇది ముందే సికింద్రాబాద్‌లో ఎస్.ఓ.టిసీ వారు చెప్పారు. మా ఇద్దరికీ కలిపి 72 యూరోలు ఇచ్చాను.

సాయంత్రం ఆరుకి లిస్బన్‌లోని హోటల్ లుటేషియాకి చేరుకున్నాం. దీపక్ అందరికీ గట్టిగా చెప్పాడు.

"డిన్నర్‌కి వెళ్ళడానికి ఏడుకి ఇక్కడ లాబీలో అంతా కలుసుకుందాం.'

రిసెప్షన్ నించి మా తాళం చెవులు తీసుకుని ఎవరివి వారికి ఇచ్చాడు. మా రూం నంబర్ 910. రిసెప్షన్‌లో ఈ బోర్డ్ కనిపించింది.

'ది వరల్డ్ ఈజ్ ఏ బుక్. దోజ్ హు డోంట్ ట్రావెల్ రీడ్ ఓన్లీ ఒన్ పేజ్.' తొమ్మిదో అంతస్థులోని మా గదికి లిఫ్ట్‌లో వెళ్ళి రిఫ్రెష్ ఐ ఏడుకి లాబీలోకి వచ్చాం. అంతా వచ్చేసరికి ఏడుంపావైంది. 7.20కి బస్‌లో డిన్నర్‌కి బయలుదేరాం. వేసవిలో యూరప్‌లో రాత్రి తొమ్మిది పైనే వెలుగుండి ఆ తర్వాతే చీకటి పడుతుంది. కిటికీలోంచి చూస్తే కనిపించిన పోర్చుగీస్ వాళ్ళు చాలా పొట్టిగా కనిపించారు. ముఖ్యంగా ఆడవాళ్ళు సగటున ఐదడుగుల రెండు అంగుళాలు ఉండచ్చు. బుడత కీచులు ఐ వీళ్ళనే అనేవాళ్ళేమో? అనిపించింది. అపార్ట్‌మెంట్ భవంతులన్నీ పాతవిగా ఉండి మేం వెళ్ళే దారంతా బీద ఊరులా కనిపించింది. బయట బటన్ని నొక్కి మాట్లాడితే, అపార్ట్‌మెంట్ వాళ్ళ మీట నొక్కితే తలుపు తెరుచుకోవడం, అప్పుడు వాళ్ళు లోపలకి వెళ్ళడం గమనించాను. 7.40కి మా బస్ ఇండియా గేట్ రెస్టొరెంట్ దగ్గర ఆగింది. హోటల్ యజమాని పేరు హేమంత్ గుజారా. వయసు 35. భార్య అనిత. తొమ్మిదేళ్ళ కూతురు కాజల్. ఐదు సంవత్సరాల కొడుకు ధ్యేయ్. శ్యామ్ నగర్ నించి 2005లో పోర్చుగల్‌కి వలస వచ్చారు.

చపాతీ, వెజ్ సలాడ్, పప్పు, పన్నీర్ కర్రీ, మిక్స్‌డ్ వెజ్ కర్రీ, పుదీనా, మేంగో పికిల్స్, పెరుగు. అన్నం లిమిటెడ్‌గా పెట్టారు. జయదేవ్ విసుక్కుని కోపంగా అన్నమాటలకి మాకు నవ్వొచ్చింది.

"అన్నం పరబ్రహ్మ స్వరూపం అన్నారు కానీ రొట్టె పరబ్రహ్మ స్వరూపం అనలేదు."

రాత్రి 8.50కి డిన్నర్ ముగించుకుని తిరిగి హోటల్‌కి బయల్దేరాం. రాత్రి పది దాకా చుట్టుపక్కల సందులు తిరిగి చూసాం. యూరప్‌లో ఓ ఊరు చూస్తే మరోటి చూడక్కర్లేదు. అన్నీ ఒకేలా అనిపిస్తాయి. పదిన్నరకల్లా హోటల్ గదికి వచ్చి పడుకున్నాం. మా టూర్లో నాలుగోరోజు అలా ముగిసింది.

*(కొనసాగింపు వచ్చేనెలలో)*

Post your comments

www.anandbooks.com
www.telugubooks.in
*ప్రస్తుతం అందుబాటులో ఉన్న మల్లాదిగారి పుస్తకాల వివరాల కోసం ఇక్కడ క్లిక్ చేయండి*